క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యురాలు ప్రవళిక సుమారు 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మోతి బిందు సమస్య ఉన్నవారిని గుర్తించి కంటి ఆపరేషన్ కోసం ఆర్మూర్ లయన్స్ ఆస్పత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకులింగం, జ్ఞాన సాగర్‌రెడ్డి, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను శుభ్రంగా ఉంచాలి



బాల్కొండ: ప్రభుత్వ పాఠశాలలను స్కావెంజర్లు శుభ్రంగా ఉంచాలని ఎంఈవో రాజేశ్వర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని పాఠశాలల స్కావెంజర్లకు, ఆశా వర్కర్లకు మంగళవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణలో విరివిగా మొక్కలు పెంచే బాధ్యత స్కావెంజర్లదే అన్నారు. ప్రతి పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు ప్రభాకర్, సుమలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రాధాన్యం



రుద్రూర్: కేంద్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో మంగళవారం పార్టీ ఆదేశాల మేరకు రచ్చబండ, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో యువమోర్చా మండల అధ్యక్షుడు కుమ్మరి గణేశ్, ప్రశాంత్ గౌడ్, పార్వతి మురళి, వి రామ్‌రాజ్, శివప్రసాద్, వినోద్‌కుమార్, అనిల్, సాయికుమార్, నాగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



వేల్పూర్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో–ఇన్‌చార్జి యాడవెల్లి అజయ్ పేర్కొన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మెల నిర్మాణం చేపట్టాలన్నారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసి మాదిగల చైతన్యాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కనక ప్రమోద్, ప్రశాంత్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



బాల్కొండ: తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ మహా సభలకు చెందిన వాల్ పోస్టర్లను మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలో పీకేటీపీ బీడీ కంపెనీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ముత్తెన్న మాట్లాడుతూ.. ఈ నెల 19న నిర్వహించే జిల్లా మహాసభ, 21,22న జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోశెట్టి, గంగాధర్, పండరి, రాజమణి, లత, రమ్య, సంగీత పాల్గొన్నారు.

అనుమతి లేని స్కూళ్లలో పిల్లలను చేర్చవద్దు

రుద్రూర్: అనుమతి లేని ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చేర్చవద్దని ఎమ్మార్పీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోంపూర్ పాచిరాం తల్లితండ్రులను కోరారు. కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనుమతి లేని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లపై సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

రెంజల్(నవీపేట): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురికి మంగళవారం సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్‌బేగం జైలు శిక్ష విధించారని నవీపేట ఎస్సై వినయ్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో పాతంగల్, నవీపేట గ్రామాలకు చెందిన ముగ్గురు పట్టుబడ్డారని వివరించారు. ఇద్దరికి నాలుగు రోజులు, ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

మృత్యు మలుపులు

- కనిపించని హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



ప్రమాదకరంగా ఉన్న డొంకేశ్వర్‌–అన్నారం రోడ్డు మూల మలుపు



మారంపల్లికి వెళ్లే రోడ్డులో ఉన్న మూలమలుపు

డొంకేశ్వర్: మలుపుల రోడ్లు ప్రమాదకరంగా మారాయి. చెట్ల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. డొంకేశ్వర్ మండలంలో పలు గ్రామాలకు వెళ్లేందుకు పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. తొండాకూర్ నుంచి మండల కేంద్రానికి వెళ్లే మార్గంలో ఐదు చోట్ల ప్రమాదకరంగా మూల మలుపులు ఉన్నాయి. డొంకేశ్వర్ నుంచి అన్నారం, సిర్పూర్‌కు వెళ్లే మార్గంలో నాలుగు చోట్ల, నూత్‌పల్లి నుంచి జీజీ నడ్కుడకు వెళ్లే రోడ్డులో మూడు చోట్ల, అలాగే దత్తాపూర్ నుంచి మారంపల్లి, మారంపల్లి నుంచి నూత్‌పల్లి, గంగాసముందర్ గ్రామాలకు వెళ్లే రోడ్డులో ఎనిమిది మూల మలుపులు ఉన్నాయి. మలుపుల వద్ద చెట్లు ఉండడంతో రోడ్డు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పుతున్నాయి. వారికి వారే పడడం లేదా ఇతర వాహనాలను ఢీకొనడంతో గాయాలపాలవుతున్నారు. అన్నారం, సిర్పూర్ రోడ్డులో భారీ మూల మలుపుల కారణంగా పలువురు వాహనదారులు మృతిచెందిన ఘటనలు ఉన్నాయి. ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని మండల వాసులు మండిపడుతున్నారు.



దత్తాపూర్ శివారులో..



తొండాకూర్ నుంచి డొంకేశ్వర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో..

హెచ్చరిక బోర్డులు లేవు



మండలంలోని అన్ని గ్రామాలకు వెళ్లే రోడ్డులో మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. మలుపుల వద్ద రోడ్డు కనిపించకుండా ఉన్న చెట్లను తొలగించాలి.

– సుంకరి నాగరాజు, డొంకేశ్వర్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



వేల్పూర్‌లో మాట్లాడుతున్న వైద్యాధికారి శరత్‌చంద్ర



అడవిమామిడిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

వేల్పూర్: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వేల్పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారులు శరత్‌చంద్ర, వీణ సూచించారు. వేల్పూర్, పడగల్ గ్రామాల్లో మంగళవారం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వీడీసీ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్యకార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అడవిమామిడిపల్లిలో..

మాక్లూర్: మాక్లూర్ మండలంలోని అడవిమామిడిపల్లిలో ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పరిసరాల్లో నీటి నిలువ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి అరుణ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వర్ని: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వర్ని ఎంపీడీవో వెంకటేశ్వర్ సూచించారు. ఆరోగ్య సిబ్బంది, తాగునీటి అధికారులు, ఉపాధి హామీ అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో డయేరియా, మలేరియా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీవో మారుతి, మెడికల్ ఆఫీసర్ అయేషా, హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మనీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాత్విక పాల్గొన్నారు.



వర్నిలో మాట్లాడుతున్న అధికారులు

నందిపేటలో..

నందిపేట్: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. జీపీ కార్యదర్శులకు ఉపాధిహామీ సూపర్‌వైజర్లకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ విద్యాసాగర్, లక్ష్మి, ప్రసాద్, సవిత, పద్మావతి, భాస్కర్, సురేందర్, సిబ్బంది పాల్గొన్నారు

ప్లాస్టిక్ బ్యాగులు నిషేధించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్: వీధి వ్యాపారులు ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం నిషేధించాలని శానిటరి ఎస్సై గజానంద్ అన్నారు. వంద రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతుబజార్‌లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణం కాలుష్యమవుతుందన్నారు. ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా విధిస్తామన్నారు. అలాగే పట్టణంలోని 8వ, 21వ వార్డులో పారిశుధ్య పనుల పరిశీలన, వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమాళి, మెప్మా టీఎంసీ ఉదయ్‌శ్రీ, రాజన్న, గోపి తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ పోలీస్ ఆఫీసర్ల నియామకం

రెంజల్: మండలంలో విలేజ్ పోలీస్ ఆఫీసర్లను నియమిస్తున్నట్లు ఎస్సై వినయ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రాంపూర్‌లో డ్యూటీలో భాగంగా రోల్‌కాల్ నిర్వహించారు. ప్రజలతో కలిసి ఫూట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను పటిష్టం చేస్తామన్నారు. మధ్యవర్తిత్వం లేకుండా బాధితులు నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఇరిగేషన్ స్థలం స్వాధీనం

పెర్కిట్: కొటార్మూర్‌లో ఆక్రమణకు గురైన ఇరిగేషన్ స్థలాన్ని అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. 63వ నంబర్ జాతీయ రహదారి పక్కన సర్వే నంబర్ 40/1లోని ఎకరం 38 గుంటల ఇరిగేషన్ స్థలాన్ని రియల్టర్ ఒకరు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఇటీవల ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేశారు. మంగళవారం నిర్మాణాలను తొలగించి భూమిని స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఫిర్యాదుపై స్పందించిన సీపీ



ఖలీల్‌వాడి: సమస్యపై పోలీస్ క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న ఓ వృద్ధురాలి ఫిర్యాదుపై సీపీ సాయిచైతన్య స్పందించారు. వివరాలిలా ఉన్నాయి. ఆర్మూర్‌కు చెందిన వృద్ధురాలు యాదమ్మ తమ బంధువులు దాడి చేశారని సమస్యను పరిష్కరించాలంటు సీపీ కార్యాలయానికి మంగళవారం చేరుకుంది. కాగా సీపీ లేకపోవడంతో కార్యాలయ ఆవరణలో సీపీ కోసం వేచి చూసింది. సాయంత్రం కార్యాలయానికి కారులో వస్తున్న సీపీ వృద్ధురాలిని చూసి ఆమె వద్దకు వెళ్లారు. తమ సమీప బంధువులు పాత కక్షల నేపథ్యంలో తనపై దాడి చేశారని వివరించింది. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యానారాయణ సెలవులో ఉండడంతో ఎస్సై తిరుపతికి సమస్యను విన్నవించినా స్పందించడం లేదని వృద్ధురాలు తెలిపింది. దీంతో సీపీ సమస్యను పరిష్కరించాలంటు ఎస్‌హెచ్‌వోకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

ఆర్మూర్: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లోని తన నివాసంలో మంగళవారం ఆర్మూర్ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ మారచంద్రమోహన్, చిన్నారెడ్డి, శ్రీకాంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



టీపీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

‘యోగాంధ్ర–2025’కు విశ్వనాథ్‌కు ఆహ్వానం



మహాజన్ విశ్వనాథ్

రుద్రూర్: మండల కేంద్రానికి చెందిన యోగా మాస్టర్ డాక్టర్ మహజన్ విశ్వనాథ్‌కు రాయలసీమలో నిర్వహించే యోగాంధ్ర–2025 కార్యక్రమానికి ఆహ్వానం లభించింది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి 20 వరకు రాయలసీమ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కర్నూల్‌లో నాలుగు రోజుల పాటు వర్క్‌షాపు నిర్వహించనున్నారు. ఈ నెల 19న లైఫ్ ఈజ్ యోగా, యోగా ఈజ్ లైఫ్(జీవనమే యోగా, యోగయే జీవనము) అనే అంశంపై ఉపన్యసించడానికి మహజన్ విశ్వనాథ్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. దైనందిన జీవితంలో యోగ ప్రాధాన్యతను వివరించడానికి రాయల విశ్వవిద్యాలయం నుంచి రుద్రూర్‌వాసికి ఆహ్వానం అందడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ విశ్వనాథ్‌ను అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాఎస్ చంద్రిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులన్నారు. బీఎస్సీలో ఎంపీసీ, ఎంపీఎస్, ఎంఎస్‌సీఎస్, బీజెడ్‌సీ, ఎంబీజెడ్‌సీ, బీకాం, బీఏ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తులను ఈనెల 23లోగా కళాశాలలో అందించాలని మరిన్ని వివరాలకు 98665 86887, 99596 31207 నంబర్లను సంప్రదించాలన్నారు.

రుద్రూర్‌లో..

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) శివారులో ఉన్న ఆదర్శపాఠశాల /కళాశాలలో ఆంగ్లం, జంతుశాస్త్రం సబ్జెక్టులను ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చెన్నప్ప తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు ఈ నెల 20న పాఠశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో డెమోకు హాజరు కావాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

మాక్లూర్: మండలంలోని రామచంద్రాపల్లిలో బాధితుడికి మంజూరైన రూ. అరవై వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం అందజేశారు. నాయకులు సఖి ప్రభాకర్, గుణం గంగారాములు, బుర్ర గంగారాం, పోశెట్టి, చిన్నయ్య, గంగాధర్, లింగన్న పాల్గొన్నారు.

యోగాతో పఠన శక్తి పెరుగుదల



యోగా చేస్తున్న విద్యార్థులు

మాక్లూర్: యోగాతో పట్టణ శక్తి పెంపొందుతుందని యోగా శిక్షకురాలు నమ్రత అన్నారు. మంగళవారం మండలంలోని దాసునగర్ చౌరస్తా వద్ద ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఆయుష్ బృందం విద్యార్థినులచే యోగా చేయించారు. ప్రతిరోజు యోగా చేయడం అలవర్చుకోవాలని డాక్టర్ ప్రేమలత సూచించారు. ప్రిన్సిపాల్ కె లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ ఎం సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలి



రాజారాంనగర్‌లో అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



రుద్రూర్‌లో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు

ఆర్మూర్‌టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని రాజారాంనగర్‌లో మంగళవారం ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు కలిపి కాలనీల్లో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్య, భోజనం అందుతుందని అన్నారు. కార్యక్రమంలో సీడీపీవో భార్గవి, సూపర్‌వైజర్లు నళిని, వెంకట రమణమ్మ, అంగన్‌వాడీ టీచర్లు దుర్గా, నాగరాజేశ్వరి, రాజలక్ష్మి, అరుణ, రజని, సవిత, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

రుద్రూర్: కోటగిరి, పోతంగల్, రుద్రూర్ మండల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులను కేంద్రంలో చేర్పించారు. వీరికి అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సిబ్బంది, చిన్నారుల తల్లులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కోటగిరి మండలం వల్లభాపూర్‌లో..

ఆటోనగర్‌లో అన్నీ సమస్యలే

- కనీస సౌకర్యాలు కరువు
- మట్టి రోడ్లపై అడుగులోతు గుంతలు
- ముళ్ల పొదల మధ్య నివాసాలు



బురదమయంగా మారిన రోడ్లు



ఆటోనగర్ కాలనీలో అడుగులోతు గుంతలతో బురదమయంగా మారిన రోడ్డు

బోధన్: బోధన్ మున్సిపల్ ఒకటో వార్డు పరిధిలోని ఆటోనగర్ కాలనీ వాసులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. బోధన్ నుంచి నిజామాబాద్ వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన రెండు దశాబ్దాల క్రితం ఏర్పడిన ఈ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించలేదు. సుమారు 400 వరకు పక్కా ఇళ్లు, రేకుల షెడ్లు ఉన్నాయి. 550 పైగా జనాభా ఉంటుంది. కాలనీలో రెండు చోట్ల మాత్రమే సీసీ రోడ్లు దర్శనమిస్తున్నాయి. మిగిలిన కాలనీలోని మట్టి రోడ్లు వర్షానికి అడుగు లోతు గుంతలు పడి బురదమయంగా మారాయి. పట్టణ శివారులో బోధన్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే ప్రధాన రోడ్డు అంచున ఆటో కాలనీ ఉంది.

కాలనీలో నివాసాల మధ్య పిచ్చిమొక్కలు పెరిగాయి. ఇళ్లల్లోకి పాములు, విషపురుగులు చొరపడుతున్నాయని కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. వైద్యం కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రి, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలంటే ఆటో వారు అధికంగా వసూలు చేస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బురదమయంగా మారిన రోడ్లపై కాలినడక వెళ్లాలంటే కూడా నరక యాతన పడాల్సిందే. ఈ కాలనీ వాసులు రేషన్ బియ్యం కోసం కిలో మీటర్ దూరంలో ఉన్న ఆచన్‌పల్లికి వెళ్తున్నారు. పట్టణ కేంద్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న కాలనీ విద్యార్థులు, చిన్నారులు బురద గుంతల రోడ్డు మీదుగా వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఏళ్లు గడిచిపోతున్న కాలనీ అభివృద్ధి పై ఎవరూ కనికరించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుద్ధ్యం నిర్వహణకు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



బ్యాక్ వాటర్‌లో మొరం తవ్వకాలు

డొంకేశ్వర్: మండలంలోని జీజీ నడ్కుడ, గాదేపల్లి శివారులోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో జోరుగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయి. అధికారుల అనుమతి లేకుండా జేసీబీలను పెట్టి టిప్పర్లలో మొరంను తరలిస్తున్నారు. మొరం తవ్వగా ఏర్పడిన భారీ గుంతలతో పశువులు ప్రమాదాల బారిన పడుతున్నాయని కాపర్లు చెబుతున్నారు.

రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాజా గౌడ్

పెర్కిట్: పంట వైవిధ్యంలో భాగంగా రైతులు ఆయిల్ పామ్ పంటను సాగు చేయాలని ఆర్డీవో రాజా గౌడ్ సూచించారు. ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఉన్న ప్రీయూనిక్ కంపెనీ ఆయిల్ పామ్ నర్సరీని ఆర్డీవో మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. రైతులు సంప్రదాయ పంటలు మాని దీర్ఘకాలం దిగుబడులు ఇచ్చే ఆయిల్ పామ్‌పై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం ఉద్యానవన శాఖ అధికారులు ఆయిల్ పామ్ పంట విశిష్టతను ఆర్డీవోకు తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారులు రాజు, రోహిత్, వినాయక్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న అనిల్ కులకర్ణి

రుద్రూర్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ ఉచితంగా అందిస్తారని కోటగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనిల్ కులకర్ణి అన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని రచ్చగల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఆయన పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉదయ్ చంద్ర, ఉపాధ్యాయులు కృష్ణమోహన్ కులకర్ణి, కనీజ్ ఫాతిమా, విద్యార్థులు పాల్గొన్నారు.